# (అ)పరాజిత

## శైలజారాంషా



“అన్ని విధాలా ఓడిపోయా నమ్మా! ఇంక బతకడం దండగ తల్లీ! ప్రేమ రాహిత్యంలో, ప్రాణభయంతో జీవించడం ఎందుకు? నిన్ననే పేపర్‌లో చూశాను. తండ్రిని చంపిన తనయుడని, నాకు సంబంధించిన వార్త కూడా మీరందరూ తప్పక త్వరలోనే చూస్తారు. ఫలానా ప్రమీల భర్త చేతిలోనో, పుత్రుడి చేతిలోనే చావు చవిచూసిందని.” ఏడుపొక్కటే తక్కువగా వుంది ప్రమీలకు.

“ఎందుకాంటీ? అంతలా నిరాశపడ్డారు? చేతిలో విద్య వుంది, స్థిరమైన ఉద్యోగం వుంది. మీరే ఇలా నీరసపడిపోతే, ఇంక మామూలు ఆడవాళ్ళ పరిస్థితి ఏమవుతుంది? అసలు సంగతి కాస్త విపులంగా చెప్పండి. మీ ఉత్తరం ద్వారా సంగతి అర్థమైనా, మీ ద్వారా వినాలని వుంది” అని సముదాయించింది సరిత.

“అందుకే కదమ్మా! నీదగ్గరకొచ్చింది. 30 సంవత్సరాల వైవాహిక జీవితం గడిపిన నేను, 30 సంవత్సరాల వయస్సు వున్న నీ దగ్గరకొచ్చింది. నీ ఆధునిక దృక్పథంతో, నీ సహజ ధైర్య సాహసాలతో నా సమస్యను పరిష్కరించుకోవాలని. ఇంక అసలు సంగతిలోకి వస్తాను చూడు. నేను జువాలజీలో పట్టభద్రురాలినై ప్రభుత్వ కళాశాలలో సీనియర్ లెక్చరర్‌గా ప్రవేశించాను. విద్య, ఉద్యోగం విజయవంతంగా పరిణమించినా, వివాహపర్వం మాత్రం ఆశాజనకంగానూ, ఆనందదాయకంగానూ జరగలేదు. ఏదో మామూలు ప్రైవేటు ఉద్యోగంతో, లక్ష వ్యసనాలతో నా జీవితంలోకి వివాహ బంధం ఆసరాగా ప్రవేశించాడు లక్ష్మణరావు. అతని ఆంక్షలతో, ఆరళ్ళతో, వ్యసనాలతో 30 సంవత్సరాల గడువు గడిచిపోయింది. అన్నదమ్ములు, అక్కాచెల్లెళ్ళు, కన్నవాళ్ళు అందరితో సంబంధాలు వదులుకొని, అతను చెప్పినట్లుగా నడుచుకున్నాను. ముగ్గురు ఆడపిల్లలు, ఆఖరి సంతానం అబ్బాయి.

అసలు బీజం విషమైతేనేమి, నా పెంపకంలో మంచి సంస్కారం పుణికి పుచ్చుకుంటారనుకున్నాను. అమ్మాయిల వరకూ నా అంచనా నిజమైంది. చక్కగా చదువుకొన్నారు. వారి అందచందాలు, చదువులు చూసి మంచి సంబంధాలు వచ్చాయి. ఇద్దరమ్మాయిల వివాహాలు జరిపించాను. మూడో అమ్మాయి మాత్రం పెళ్ళి చేసుకోనని, ఈ లంపటాలు నాకొద్దని అమెరికాలో ఉద్యోగం సంపాదించి వెళ్ళిపోయింది.

అబ్బాయి మాత్రం తండ్రి ముక్కులోంచి ఊడిపడ్డాడు. ఎం.బి.ఎ. చదువుకొని, ఉద్యోగస్తుడు మాత్రం అయ్యాడు. లేని వ్యసనం లేదు. దానికి తోడు ఇప్పుడు ఎవరో పిల్లని ప్రేమించాడట. దాన్నే పెళ్ళాడతాడట. నన్ను మాటలకి వెళ్ళమన్నాడు. అదేమిట్రా వాళ్ళు రావాలిగానీ, మనం వెళ్ళడమేమిటీ అని అంటే, వాళ్ళు చాలా గొప్పవాళ్ళు, వాళ్ళు రారు గానీ మనమే వెళ దాం పద అని తీసుకెళ్ళాడు. దానికి వాళ్ళ నాన్న సపోర్టు. సరే ఎలాగోలాగా వెళ్ళాం. వాళ్ళ ఇల్లు వాకిలి, పద్ధతి చూసి నాకు అక్కడే కడుపుతో త్రిప్పింది.

వాళ్ళు చాలా ధనవంతులట. అందుకని ఎవరితోనూ మాట్లాడరట. ఏదో మాకు కనపించారు. అదే మా అదృష్టమట. నా పేరున ఉన్న ఆస్తులన్నీ అమ్మేసి నగలు చేయించి ఆ అమ్మాయికి పెడతారట తండ్రీకొడుకులు. 30 సంవత్సరాల వైవాహిక జీవితంలో ఏనాడూ నాకింత బంగారం, అంతదాకా ఎందుకమ్మా! ఒక్కనాడు ఒక్క చీర కొని ఎరుగడు. ఇంక కొడుకు సంగతి సరేసరి.

[illegible] తాగుడికీ డబ్బు ఇవ్వమని నన్నే [illegible] పోయేవాడు. పెళ్ళైన తరువాత [illegible] ఆటోగాని, రిక్షాగాని ఎక్కలేదు. చిట్టి, [illegible]లు కట్టి డబ్బు దాచాను. ఎంతో శ్రమ పడి సంసారానికి ఒక్కొక్క వస్తువూ సమకూర్చాను. జి.పి.ఎఫ్‌లోన్లు తీసి స్థలాలు కొన్నాను. అవన్నీ ఇప్పుడు లక్షల విలువ చేసే ఆస్తులైనాయి.

ఆడపిల్లలకు కూడా పైసా ఖర్చు పెట్టకుండా వివాహాలు జరిగాయి. ఇంకా తిరిగి వాళ్ళే నాకు అన్నీ పెట్టడానికి రెడీగా వున్నారు. ఆ చిన్న పిల్ల అమెరికా నుంచి తిరిగి నాకే డబ్బు పంపిస్తుంది. నా బంగారం అంతా ఆడపిల్లలకు ఇద్దామంటే అది కూడా భరించేటట్లు లేరు. ఎప్పుడు పీక నొక్కి చంపేస్తారోనని భయంగా వుంది. 'నాకు కాకుండా ఏమైనా చేయాలని చూశావో, నీవు మిగలకుండా చేస్తాను' అని బెదిరించి వెళ్ళాడు. పుణ్యాం కొద్దీ పురుషుడు, దానం కొద్దీ బిడ్డలు అన్నారు. నేను రెండూ సరిగ్గా చేయలేదు అనుకుంటాను. 'అపుత్రస్య గతిర్నాస్తి' అన్నారు పెద్దలు. పుత్రుడు ఉండీ గతి లేని దాననైనాను" అని వెక్కి వెక్కి రోధించడం మొదలుపెట్టింది. వెన్ను నిమురుతూ ప్రక్కనే కూర్చుంది సరిత ఆమె దుఃఖం తగ్గేవరకూ వేచి చూస్తూ!

10 నిముషాల తరువాత ఆమెకు కొంత ఉపశమనం కలిగి, తను చెప్పబోయే సలహాకోసం ఎదురు చూస్తుందని గ్రహించుకొని మొదలు పెట్టింది సరిత.

"ఆంటీ! ఈ 2 సంవత్సరాలలో అంటే, మేము ఈ సెంటర్ మొదలు పెట్టిన తరువాత ఇంతవరకూ ఇలాంటి సమస్యను ఎదుర్కొనలేదు. అన్నీ కూడా కొత్తగా వివాహం చేసుకున్న యువతీయువకుల బాధలే. చాలా చిన్న సెషన్‌తో పై సమస్యలన్నీ పరిష్కారమైపోయేవి. మీ సమస్య కొంచెం క్లిష్టంగా ఉన్నప్పటికీ సమస్య పరిష్కార దూరమేమీ కాదు. మీకు ఆర్థిక లోపమేమీ లేనందువలన కొంత సాహసం, తెగువతోటి మీ సమస్య పరిష్కృతమవుతుంది. కాకపోతే కొంత సమయం పట్టవచ్చు. మీరు మరొకసారి తీరిగ్గా, మీ పరిస్థితిని సమన్వయించుకొని రేపు ఉదయం 10 గంటలకు ఇక్కడకు వస్తే, మా లీగల్ అడ్వయిజర్‌తో మేము తయారుగా వుంటాము. ఆమె అయితే, మీకు సరైన దారి చూపించగలరు. ఇంక మీరు ప్రశాంత చిత్తంతో ఇంటికి వెళ్ళండి. ఎలాంటి తొందరపాటు పనీ చెయ్యకుండా, ధైర్యంగా రేపు ఉదయం రండి. మీకోసం మేం ఎదురు చూస్తుంటాం" అని ప్రమీలను సాగనంపింది సరిత.

ప్రక్క గది నుంచి దూసుకు వచ్చింది పద్మ. "సరితా! ఈవిడ ఎలా వచ్చింది? ఆమె చెప్పింది అంతా నిజమే! మేము కూడా అదే వీధిలో ఉంటాము కదా! పాపం ఆటో ఎక్కేవాళ్ళని, సినిమాకెళ్ళేవాళ్ళని చూసి నవ్వేదట. డబ్బెందుకు అలా తగలబెడతారు? దాచి పిల్లలకు ఇవ్వవచ్చు కదా! అని ఇప్పుడు వాడు యముడై కూర్చున్నాడు" అంటూ "మాట్లాడవేమే?" అని సరితను గద్దించింది.

"ఇంతసేపూ నన్ను మాట్లాడనీయకుండా వాగి, నన్ను మాట్లాడలేదంటావేమిటి? చెప్తా విను. ఈమె మన సెంటర్‌కు ఉత్తరం రాసింది, ఇదీ సమస్య అని తెలియచేస్తూ. వారం రోజుల తరువాత తనే వస్తానని, పోస్టు ద్వారా ఏ సంగతీ తెలపవద్దనీ కోరుతూ. ఈ లోపల నేను కొంత గ్రౌండు వర్కు చేశానులే. మీ తమ్ముడు మహేష్‌ను పిలిచి ఆ పిల్లవాడితో స్నేహం చేయమన్నాను. విషయం ఇదీ, అని చెప్పి జాగ్రత్తగా వివరాలు సేకరించమని, మరీ మనం ఏకపక్ష పరిష్కారాలు చేయలేం కదా! మహేష్ చాలా ఉపయోగకరమైన వివరాలు రాబట్టాడు. వాడికి లేని వ్యసనాలు లేవట. తండ్రీ, కొడుకు ఈ విషయంలో సరిసమానులట. తల్లి అన్నీ అమ్మి డబ్బు తమకు ఇస్తుందనీ, మహా హుషారుగా వున్నారట. మనం రంగంలో వున్నట్లు వారికింకా తెలియదు."

"అంతా తెలిసే ఆమెను ప్రశ్నలడిగి వేధించావా? ఎంత దుర్మార్గురాలివే నువ్వు?" అని విరుచుకు పడింది పద్మ.

"ఆగవమ్మా పద్మమ్మ తల్లీ! ఆవిడ వెనుక డిటెక్షన్ చేస్తున్నాం అని తెలిస్తే బాధ పడదూ! అయినా ఆవిడ బాధ మనకు ముఖతః తెలియవద్దూ! రేపు నువ్వు కూడా 10 గంటలకు ఇక్కడకు రా! అరుణకు కూడా ఫోన్ చేయాలి. నీ జాలి ఆవిడ సమస్యను తీర్చలేదు. అరుణకి ఫోన్ చేసి అపాయింట్‌మెంట్ ఫిక్స్ చెయ్యి" అని పద్మను పంపించింది సరిత.

## హాలీవుడ్‌కు ఐస్

ఐస్ ఇటీవల న్యూయార్క్‌కు వెళ్ళినప్పుడు ఆమె పలువురు హాలీవుడ్ ఏజెంట్లను, నిర్మాతలను, నటులను కలిసింది. ప్రముఖ నటుడు రాబర్ట్ డినోరోను ఆమె కలుసుకొంది. ఐశ్వర్య అందానికి ముగ్ధుడైన ఈ వృద్ధ నటుడు రికమండేషన్‌కు అంగీకరించినట్లు సమాచారం. అయితే, ఇటీవల ఒక హాలీవుడ్ దర్శకురాలు ఐశ్వర్య కోసం ప్రయత్నించగా ఆమెకు చేదు అనుభవం ఎదురైంది. ఆ దర్శకురాలు పేరు వినని ఆమె సెక్రటరీ, 'ఐశ్వర్య లేదు పో' అని సమాధానం యిచ్చాడట. ముందు పర్సనల్ సెక్రటరీని మార్చుకొని, ఆ తర్వాత హాలీవుడ్‌కు ట్రై చేస్తే బాగుంటుందనే కామెంట్‌లు బాలీవుడ్‌లో వినిపిస్తున్నాయి. *(నిజమే కదా!)*



మరునాడు ప్రొద్దున్నే 10 గంటలకు ప్రమీల కోసం ఎదురు చూస్తున్నారు పద్మ, సరిత. అరుణ కూడా రెడీ అయి సెంటర్‌కు చేరుకుంది. 10 నిముషాల్లో ఆటోలో సెంటర్ ముందు దిగింది ప్రమీల.

"రండి ఆంటీ! మీ కోసమే ఎదురు చూస్తున్నాం" అంటూ ఆహ్వానించింది సరిత. "ఈమె పద్మ, మా కో-కౌన్సిలర్. ఈమె అరుణ. లీగల్ అడ్వయిజర్. ప్రస్తుతం మీ సమస్య పరిష్కారం ఈమె చేతిలోనే వుంది" అని పరిచయ కార్యక్రమం ముగించి, అందరికీ కాఫీలు అందించింది సరిత. కాసేపు రిలాక్స్ అయిన తరువాత, అరుణ మొదలు పెట్టింది. "మేడమ్! మిమ్మల్ని పిన్నిగారూ అని పిలవవచ్చా?"అని. "తప్పకుండా అమ్మా! అలా పిలిపించుకోవడం నా అదృష్టం" అంటూ సమాధానం ఇచ్చింది ప్రమీల.

"మీకు ఇప్పుడు ఉన్నపళంగా ఇక్కడి నుంచి కదలాలంటే ఏమీ ఇబ్బంది లేదు కదా!" అని అడిగింది అరుణ.

"లేదమ్మా! నాకేమీ లేదు. నేను ఇక్కడి నుంచి బస్‌లో రోజా ఇబ్రహీం పట్నం దాకా వెళ్ళి వస్తాను. నా వంట నేను చేసుకోగలను. ఇంక ఇబ్బంది ఏమి వుంది?" అని సమాధానమిచ్చింది ప్రమీల.

వెంటనే అరుణ అందుకుంది "మేము ముగ్గురం కలిసి, రెండు పరిష్కారాలను సూచించదలుచుకున్నాం పిన్నిగారూ! మీకు ఇష్టమైన దానిని, వీలైన దానిని, సబబైన దానిని ఆచరించండి.

మొదటిది ఎక్కడైనా దూర ప్రాంతానికి బదిలీకోసం ప్రయత్నించండి. స్త్రీ సంక్షేమ శాఖ ద్వారా మేము మీకిది చేసిపెట్టగలం. మీ పరోక్షంలో మీ స్థిర, చరాస్తులకేమీ భంగం కలగకుండా, క్రయవిక్రయాలు చెల్లకుండా న్యాయపరమైన ఏర్పాట్లు మేము చేస్తాం. ఇకపోతే రెండవది. మీ ఉద్యోగానికి 2 సంవత్సరాలు సెలవు పెట్టి, మీ అమ్మాయి దగ్గరకెళ్ళండి. కావాల్సిన ఏర్పాట్లు, 15, 20 రోజుల్లో ఏర్పాటు చేయిస్తాను. అక్కడ వాతావరణం, పరిస్థితులు మీకు నచ్చితే, మీరు అక్కడే వుండవచ్చు. మా ఉద్దేశ్యంలో మీకు సబబైనది ఇదే అని. ఎందుకంటే ఎంత దూరప్రాంతానికి బదిలీ చేయించుకోదలచినా, మిమ్మల్ని వెంటాడే వారు, వెంటాడక మానరు. ఆర్థికంగా మీ మీద ఆధారపడిన వారు అమెరికా వరకూ రాలేరు. ప్రభుత్వ పరంగా మీకు ఏ సమస్యా రాకుండా పంపించే బాధ్యత నాది. పై రెండింటిలో మీకు ఏది సమ్మతమైనా మాకు అభ్యంతరమేమీ లేదు" అని ముగించింది అరుణ. "కావాలంటే మీ ఆస్తులన్నింటినీ ధన రేపేణా మార్చుకోవడానికి కూడా మేము సహాయపడతాం" అంటూ మరొక సహాయాన్ని కూడా సూచించింది పద్మ. పద్మమ్మ తల్లిది ఎలాగైనా జాలిగుండె అనుకుంటూ మీ నిర్ణయమేమిటన్నట్లు పరికించి చూసింది సరిత ప్రమీలవైపు.

"నాకొక 15 నిముషాల సమయం ఇవ్వండమ్మా! ఆలోచించుకోడానికి."

"మంచిది పిన్నిగారూ! మీ ఇష్టం వచ్చినంత సమయం తీసుకోండి. మీకు ఏ ఆపదా వాటిల్లక ముందే సరైన నిర్ణయం తీసుకోండి. ఏ అఘాయిత్యమూ చేయకండి. మీకు, మీ నిర్ణయానికి చేదోడుగా మా సెంటర్ ఎల్లప్పుడూ వుంటుంది. నేను ఇక బయలుదేరుతాను. మీరు మీ నిర్ణయం సరితకు తెలియజేయండి" అంటూ కదిలింది అరుణ.

## దృ(ది)ష్టి

పెళ్ళి కుమారుడికి
పిల్లపరువాలు మీద
కన్న తండ్రికి
కట్నం మీద
తల్లికి
లాంచనాల మీద
అప్పచెల్లెళ్ళకి
ఆడపడుచు కానుకల మీద
అన్నదమ్ములకి
ఏర్పాట్ల ఖర్చుల మీద
వదినెమ్మలకి
పట్టు చీరల మీద
మేనమామలకి
మగపెళ్ళి వారి హోదా మీద
దగ్గిర బంధువులకి
వంకలు పై వంకలు మీద
మనుగుడుపు మీద
మేనత్తలకి
పెట్టు పోతలు మీద
'దృష్టి దృష్టి దృష్టి'
నర దృష్టికి
నల్ల శిలైనా పగుల్తుంది!
'దిష్టి' తియ్యండమ్మా
వధువు తల్లిదండ్రులకి

- మాధవరపు కృష్ణ

* * *

3 నెలల తరువాత న్యూ ఇయర్ గ్రీటింగ్స్ చూసుకుంటూ, ఏదో ఎయిర్ మెయిల్ ఉందేమిటీ? అనుకుంటూ తెరచి చూసి ఒక్క క్షణం ఆశ్చర్యపోయింది సరిత. అది ప్రమీలమ్మగారు మియామి నుంచి రాసిన ఉత్తరం. దానికి ఒక డ్రాఫ్ట్ కూడా జోడించి వుంది. ఈవిడ ఫీజులన్నీ సక్రమంగా చెల్లించింది కదా! మళ్ళీ ఇదెందుకు పంపారు? ముందు ఈ ఉత్తరం ఏమిటో చూద్దాం! అని చదవడం మొదలు పెట్టింది సరిత.

సరిత, పద్మ, అరుణా!

మీకన్నా వయోధికురాలును కావడం వలన మీకు నమస్కరించలేక, ఆశీస్సులు అందిస్తున్నాను. మీరు చేసిన సహాయం వలన నేను మా అమ్మాయి దగ్గర క్షేమంగా, ఆరోగ్యంగా ఉన్నాను. మా అమ్మాయి అయితే, మిమ్మల్ని తలవని రోజు లేదు. మీ ప్రోత్సాహం లేకపోతే మాకు అమ్మ వుండేది కాదు అని రోజూ అంటూ ఉంటుంది. ఇక్కడ ఎంతో సౌకర్యంగా వుంది. ఇన్ని సంవత్సరాల్లో ఏనాడూ ఎరగని తృప్తి పొందుతున్నాను. డబ్బు ఎందుకు పంపించానని మీకు సందేహం ఉండి వుంటుంది. సెంటర్‌కు శాశ్వత నివాస స్థలంను ఏర్పాటు చేయడానికని ఈ డబ్బు పంపుతున్నాను. దయచేసి ఈ డబ్బును అందుకు వినియోగించి, నన్ను కృతార్థురాలిని చేయండి. హైదరాబాద్‌లో నా సమాచారం కోసం వెతుకుతున్నారని తెలిసింది. ఏమైనా వారు నన్నేమీ చేయలేరని నా విశ్వాసం. మరొక్కసారి కృతజ్ఞతలతో, మీ జవాబుకై ఎదురు చూస్తుంటాను అని ముగించింది ప్రమీల.

ఆ ఉత్తరం పట్టుకొన్న సరితకు, రెండున్నర నెలల క్రిందట విమానం ఎక్కుతున్న ప్రమీలమ్మగారు గుర్తు వచ్చారు. నలుగురు పిల్లల తల్లి అయి, భర్త ఉండీ, తల దాచుకోవడానికి పరాయి దేశానికి పరాజితగా వెళ్ళినా, విద్యావంతురాలు, ఉద్యోగస్తురాలు అవడం వలన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించి, తన పరిస్థితులను, సమస్యలను ధైర్యంగా జయించగలిగింది. ఆమె సహకారం లేకపోతే, మా సెంటర్ మాత్రం ఏమి చేయగలదు? ఎంతమంది పరిష్కారం కోసం ముందుకు వస్తున్నారు? సమాజానికి భయపడి, పురుషుడి దౌర్జన్యానికి బలైపోయేవారు ఎక్కువ. అందుకే పద్మ అంటూ ఉంటుంది-చదువు, ప్రయోజకత్వం, సంపాదనా సామర్థ్యం ఆడపిల్లలకే ఎక్కువ అవసరం అని అనుకుంటూ కుర్చీలో నుంచి లేచింది సరిత, ఆ ఉత్తరం స్నేహితురాళ్ళకు చూపించడానికి.

